సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం : 27 : ఏప్రిల్ : 2023



జేపీఎస్‌ల పోరుబాట

నాలుగేళ్లయినా రెగ్యులర్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రేపటి నుంచి సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. 8లో



ఆర్టిజన్ల సమ్మె విరమణ

ఆర్టిజన్ల సమ్మెను విరమింపజేసేందుకు అధికారులు చేసిన కృషి ఫలించింది. దీంతో కార్మికులు తిరిగి విధుల్లో చేరారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
37° / 24°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవోపేతంగా రామయ్య నిత్యక్రతువు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా బేడా మండపంలో స్వామివారికి స్నపన తిరుమంజనం జరిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



సుజాతనగర్‌లో పంటను పరిశీలిస్తున్న డీఏఓ తదితరులు

సుజాతనగర్/జూలూరుపాడు: సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయాధికారి కొర్సా అభిమన్యుడు బుధవారం పరిశీలించారు. సుజాతనగర్‌కు చెందిన కౌలురైతు ముత్యాల నరేష్ మూడెకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా ఇటీవలి వర్షానికి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లింది. ఈ రైతుతో పాటు 33 శాతం కంటే అదనంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. అనంతరం జూలూరుపాడు మండలం కాకర్ల, వినోభానగర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. నష్టం వివరాలను నమోదు చేయాలని ఏఈఓను ఆదేశించారు. గత నెల 31న అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలు మాత్రమే నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కరుణశ్రీ, సుజాతనగర్ మండల వ్యవసాయాధికారులు దీపక్, నర్మద, జూలూరుపాడు వ్యవసాయ అధికారి ఎస్.రఘుదీపిక, టెక్నికల్ ఏఓ దీపక్ ఆనంద్, ఏఈఓలు లావణ్య, ఎంపీ గౌస్ పాల్గొన్నారు.

కేసీహెచ్‌పీలో పనుల తనిఖీ



పనులు పరిశీలిస్తున్న సీఈ

మణుగూరు రూరల్ : సింగరేణి మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో నిర్వహిస్తున్న పనులను బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న విద్యుత్‌సౌధ ఎస్ఈతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. కేసీహెచ్‌పీలో జరుగుతున్న టీపీ5, బీసీఎన్ 6ఏ కన్వేయర్, బంకర్ ఫ్లోర్ పనులను పరిశీలించారు. పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేసీహెచ్‌పీ డీజీఎం సురేష్, బీటీపీఎస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మొబైల్ కోర్టు జడ్జి బదిలీ..

భద్రాచలంఅర్బన్: అవినీతి ఆరోపణలతో ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్న భద్రాచలం మొబైల్ కోర్టు జడ్జి సీహెచ్.వెంకటేశ్వర్లును ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు సోమవారమే ఉత్తర్వులు వెలువడినా బయటకు రాలేదు. కాగా, ఆయనను తక్షణమే విధుల నుంచి రిలీవ్ కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. వెంకటేశ్వర్లు స్థానంలో భద్రాచలం దేవస్థానం ఈఓగా గతంలో చేసిన శివాజీని మొబైల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జిగా నియమించారు. ప్రస్తుతం ఆయన పాల్వంచ పరిధిలో సీతారామ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, మొబైల్ కోర్టు ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించేందుకు సుముఖంగా లేరని సమాచారం.

ఓసీకి ఓకే!

జేకే ఓసీ నిర్మాణానికి ప్రజామోదం

- మెరుగైన పరిహారం ఇవ్వాలని పలువురి వినతి
- సీఎస్సార్ నిధులను పక్కదారి పట్టించొద్దని డిమాండ్
- ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న నేతలు





అభిప్రాయ సేకరణకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, వేదికపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

ఇల్లెందు: ఇల్లెందులో జేకే ఓసీ ఏర్పాటుకు స్థానిక 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సాఫీగానే సాగింది. ప్రజామోదం మేరకే ఓసీ ఏర్పాటు చేస్తామని, అందరి అభిప్రాయాలు సేకరిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముందే ప్రకటించారు. అయితే కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు.. జేకే ఓసీ విస్తరణ ప్రభావిత ప్రాంత నిర్వాసితులకు సకాలంలో మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మాట్లాడుతూ.. గతంలో జేకే 5 ఓసీలో నష్టపోయిన వారికి నేటికీ పరిహారం అందక అలమటిస్తున్నారని, ఈసారి ఏ ఒక్కరూ తమకు పరిహారం అందలేదనే భావన రావద్దని, బాధితులను సంపూర్ణంగా ఆదుకోవాలని సూచించారు. 21 ఏరియాలో 200 మంది నివాసం ఉంటున్నారని, సింగరేణి క్వార్టర్లలో ఉంటున్నారనే సాకుతో పరిహారం చెల్లించకుండా ఉండొద్దని అన్నారు. ఓసీని ప్రైవేట్ పరం చేయవద్దని, ఓసీ నీటిని సాగుకు మళ్లించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణంలో సింగరేణి సంస్థ నిబంధనలు ఉల్లంఘించవద్దన్నారు. అనుమతి లేకుండా ఏ పనీ చేపట్టవద్దన్నారు. నిర్వాసితుల, ఆయా ప్రాంతాల అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి ద్వారా లభించే సెస్‌ను ఎత్తివేసి డీఎంఎఫ్ నిధులను నిర్వాసిత ప్రాంతాల వెలుపల ఖర్చు చేస్తున్నారని అన్నారు. సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లెందును ఓసీల పేరుతో బొందల గడ్డగా మారుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సింగరేణి పరిధిలో ఉన్న 22, 23 వార్డులను రెవెన్యూ శాఖకు అప్పగించాలని కోరారు. జేకే బస్ స్టాప్ నుంచి డీ బ్లాక్ వరకు డివైడర్ ఏర్పాటు చేసి రోడ్డు వెడల్పు చేయాలన్నారు. తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ ఓసీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని, 1/70, పెసా చట్టాలను సైతం ఉల్లంఘించారని అన్నారు. ఓసీ పరిధిలోని ప్రజలను ఆహ్వానించకుండా చేపట్టిన ఈ అభిప్రాయ సేకరణను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇంకా ఈ సభలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథ్, ఏఐటీయూసీ నాయకులు కె. సారయ్య, ఎన్డీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు , సీపీఎం నాయుకులు నబీ, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, రాంసింగ్, రేపాకుల శ్రీనివాస్, ఆలేటి కిరణ్ తదితరులు మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ బి. రవీందర్, ఎన్విరాన్‌మెంట్ జీఎం జేవీఆర్ గణపతి, ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, జేకే ఓసీ పీఓ బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ అంకుషావలి తదితరులు పాల్గొన్నారు.

1114.507 హెక్టార్ల విస్తీర్ణంలో..

ప్రజాభిప్రాయ సేకరణలో మొదట సింగరేణి జీఎం షాలేమురాజు.. ఓసీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతి కోరుతూ నివేదికను ప్రవేశపెట్టారు. రూ.297.88 కోట్లతో 1114.507హెక్టార్ల భూమిలో 2.50 మిలియన్ టన్నుల బొగ్గు సేకరణ కోసం అనుమతి కోరుతున్నట్లు తెలిపారు. ఇల్లెందు మండలం రొంపేడు, సుదిమళ్ల, ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలో ఓసీ నిర్మాణం చేపడతామని వివరించారు. అన్ని అనుమతులూ లభిస్తే ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

న్యాయంగా పరిహారం ఇవ్వాలి



దశాబ్దాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. జేకే ఓసీ ఏర్పాటు చేసి బొగ్గు తవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. మేము ఓసీ ఏర్పాటుకు వ్యతిరేకం కాదు. అయితే నిర్వాసితులందరికీ మెరుగైన, న్యాయమైన పరిహారం అందించాలి. ఇతర ప్రాంతాల్లో నివాస స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలి.
– పూనెం పాపమ్మ, నిర్వాసితురాలు, విజయలక్ష్మీనగర్

మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలి



నేను సింగరేణిలో పనిచేసి దిగిపోయాను. పనిచేస్తున్న సమయంలో ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని, ఇప్పటికీ ఇక్కడే ఉంటున్నాం. ఇప్పుడు జేకే ఓసీ ఏర్పాటుతో నిర్వాసితులమవుతున్నాం. యాజమాన్యం మాకు మెరుగైన ప్యాకేజీ ముందుగానే ఇవ్వాలి. మేం పునరావాసం పొందే వరకు ఇక్కడే నివాసం ఉండేలా అవకాశం కల్పించాలి.
– హరిసింగ్, విజయలక్ష్మీనగర్

బాధ్యతలు స్వీకరించిన జిల్లా జడ్జి



వసంత్‌పాటిల్‌కు మొక్క అందిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: జిల్లా జడ్జిగా వసంత్‌కుమార్ పాటిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి బదిలీల్లో ఇక్కడి జడ్జి చంద్రశేఖర ప్రసాద్ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ కాగా, అక్కడి నుంచి వసంత్‌పాటిల్ ఇక్కడికి వచ్చిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన జడ్జికి కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.శ్యాంశ్రీ, జి.భానుమతి, ఆడెపు నీరజ, బత్తుల రామారావు, కాసరగడ్డ దీప, బార్ అసోసియేషన్ బాధ్యులు రావిలాల రామారావు, పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి, న్యాయవాదులు దుంద్ర రమేష్, మెండు రాజమల్లు, రామిశెట్టి రమేష్, కాసాని రమేష్, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన వసంత్‌పాటిల్‌ను ఎస్పీ డాక్టర్ వినీత్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈవీఎంల తనిఖీకి ఏర్పాట్లు చేయాలి

- ఆరు ఓట్ల కంటే ఎక్కువ ఉన్న ఇళ్లను పరిశీలించాలి
- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం





హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈవీఎంల తనిఖీకి కార్యాచరణ సిద్ధం చేయాలని ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారిని ఆదేశించారు. జిల్లా, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. గతంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పేర్కొన్న అంశాలపై ఓటరు తొలగింపు, మార్పులు, చేర్పులు, ధ్రువీకరణ, అనుబంధ పత్రాలు 1,2,3,4 రూపొందించాలని సూచించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. దరఖాస్తులు, అభ్యంతరాలు అందజేయాలన్నారు. ఏప్రిల్ 1ని అర్హత తేదీగా సప్లిమెంటరీ ఎలక్టోరల్ సిద్ధం చేయడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. తక్కువ ఓటింగ్ జరిగిన నియోజకవర్గ కేంద్రాల్లో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సోషల్ మీడియాను పర్యవేక్షించడానికి సిబ్బందిని నియమించాలన్నారు. ఆరుగురి కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించి ధ్రువీకరణ అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్‌కుమార్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో విప్ రేగా భేటీ..

కలెక్టర్ అనుదీప్‌తో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం భేటీ అయ్యారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

రెండో రోజూ ప్రశాంతం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రెండో రోజైన బుధవారం కూడా ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి పరీక్షలకు కొత్తగూడెంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా 721 మంది విద్యార్థులకు 613 మంది హాజరయ్యారు. 108 మంది గైర్హాజరు అయ్యారు. ఇక ఇంటర్మీడియట్ పరీక్షలకు ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 808 మంది విద్యార్థులకు 674 మంది హాజరయ్యారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను తనిఖీ చేశాయని డీఈఓ సోమశేఖరశర్మ వివరించారు.

అడవుల పరిరక్షణ, విస్తీర్ణం పెంపు

పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్



రేంజ్ కార్యాలయాన్ని ప్రారంభించిన పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్

అన్నపురెడ్డిపల్లి: పకడ్బందీ చర్యలతో అడవులను పరిరక్షిస్తూనే విస్తీర్ణం పెంచడంపై అటవీ ఉద్యోగులు దృష్టి సారించాలని అటవీ శాఖ కంపా విభాగం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) లోకేష్ జైస్వాల్ ఆదేశించారు. మండలంలోని రామవరం రేంజ్, అబ్బుగూడెం నర్సరీ, ప్లాంటేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అడవుల పరిరక్షణ, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ప్లాంటేషన్, నర్సరీపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన అడవుల పరిరక్షణకు మరిన్ని చర్యలు చేపట్టడంతోపాటు వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు.

రేంజ్ కార్యాలయ ప్రారంభోత్సవం

చంద్రుగొండ: అంకితభావంతో విధులు నిర్వర్తించే మంచి అధికారి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును కోల్పోయామని పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్ అన్నారు. చంద్రుగొండలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ కార్యాలయా(చలమల శ్రీనివాసరావు భవనం)న్ని బుధవారం పీసీసీఎఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో భాగంగా శ్రీనివాసరావు ప్రాణాలు వదలడం దురదృష్టకరమన్నారు. ఇద్దరు దుండగుల ఘాతుకానికి ఫారెస్ట్ శాఖ మంచి అధికారిని కోల్పోయిందని పేర్కొన్నారు. శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకుని అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు.ఈకార్యక్రమాల్లో సీసీఎఫ్ బీమానాయక్, డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్ నాయక్, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓలు జి.ప్రసాదరావు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లపాడు నర్సరీలో ఆయిల్‌పామ్ సాగు



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ గౌతమ్

భద్రాచలం: చుంచుపల్లి మండలంలో ఉన్న గరిమెళ్లపాడు నర్సరీలో ఆయిల్ పామ్ సాగుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా ఉద్యానవన అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గరిమెళ్లపాడు నర్సరీలోని పది ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి పంట మార్పిడి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, ఉద్యాన విస్తరణ అధికారి చిట్టిబాబు, అధికారులు ప్రభాకర్, ఉదయ్‌భాస్కర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి షాపుల వేలం వాయిదా



వేలంలో పాల్గొన్న ఈఓ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తదితరులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీ కనక దుర్గ(పెద్దమ్మ తల్లి) ఆలయం వద్ద షాపుల నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు బుధవారం నిర్వహించిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో వచ్చే నెల 8వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, ఫొటోలు, టెంట్‌హౌస్ సామగ్రి తదితరాల అమ్మకం, అద్దెకు ఇచ్చే షాపులను అప్పగించేందుకు వేలం నిర్వహించారు. అయితే, పాటదారులు ఎవరు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, డైరెక్టర్లు ఎస్.వీ.ఆర్.కే.ఆచార్యులు, చింత నాగరాజు, కిలారు నాగమల్లేశ్వరరావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, మాలోతు సువాలి, గంధం వెంగళరావు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామారావు, పాయం పాపయ్య పాల్గొన్నారు.

ఉప పోరుకు కసరత్తు

- స్థానిక సంస్థల్లో ఖాళీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఈసీ సన్నాహాలు
- జిల్లాలో 257 స్థానాలు ఖాళీ..
- 18 ఎంపీటీసీ, 18 సర్పంచ్, 221 వార్డులు..



ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది(ఫైల్)

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ స్థానాలకు తిరిగి ఎన్నికల నిర్వహణకు మళ్లీ రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఖాళీల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఖాళీ అయిన స్థానిక సంస్థల స్థానాల వివరాలను సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపారు. ఉప పోరుపై ఆదేశాలు రావడంతో ఖాళీ స్థానాల్లో తుది ఓటరు జాబితాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు స్వచ్ఛందంగా పదవులకు రాజీనామా చేయగా, మరికొందరు మృతి చెందడం , కొందరిపై అనర్హత వేటు వంటి కారణాలతో జిల్లాలోని పలు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం గతంలో రెండుసార్లు ముందుకొచ్చినా కొన్ని అడ్డంకులతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఖాళీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు 2020 ఫిబ్రవరిలో అధికారులు కసరత్తు చేశారు. కానీ మార్చిలో కరోనా ప్రభావంతో వాయిదా పడింది. గతేడాది ఏప్రిల్‌లో మరోసారి ఉపపోరుకు సన్నాహాలు చేశారు. కానీ అనివార్య కారణాలతో మళ్లీ వాయిదా పడింది. ఆ తర్వాత ప్రభుత్వం ఉపపోరు ఊసే ఎత్తకపోవడంతో ఇక ఎన్నికలు జరుగుతాయో లేదో అని భావిస్తున్న తరుణంలో తాజాగా ఖాళీ స్థానాల వివరాలు కోరడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

వార్డులే అత్యధికం..

2019 జనవరిలో గ్రామ పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. అప్పుడు పాల్వంచ మండలంలోని సంగం, నారాయణరావు పేట ఎస్సీ కాలనీ పంచాయతీలకు రిజర్వేషన్ ప్రకారం తగిన సర్పంచ్ అభ్యర్థులు లేక అక్కడ ఎన్నికలు జరగలేదు. అదే ఏడాది మేలో జిల్లాలోని 209 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. బూర్గంపాడు మండల ప్రజా పరిషత్‌కు కాల పరిమితి ముగియకపోవడంతో అక్కడ ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 18 ఎంపీటీసీ, 18 సర్పంచ్ స్థానాలతో పాటు 221 వార్డులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బూర్గంపాడు మండలంలో 11, ములకలపల్లి మండలం సీతారాంపురం, చర్ల మండలం ఆర్ కొత్తగూడెం, కుర్నపల్లి, చుంచుపల్లి మండలం రుద్రంపూర్–1, కరకగూడెం మండలం అనంతారం, ఇల్లెందులో రేపల్లెవాడ, గుండాల ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇక అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం, అనంతారం, చంద్రుగొండ, లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, సుజాతనగర్‌లో కోమటిపల్లి, చర్లలో చిన్నమిడిసిలేరు–జి, దమ్మపేటలో శ్రీరాంపురం, గుండాలలో లింగగూడెం, సాయనపల్లి, జూలూరుపాడు, ములకలపల్లిలో గుట్టగూడెం, మూకమామిడి, పాల్వంచలో నారాయణరావుపేట ఎస్సీ కాలనీ, సంగం, దంతెలబోర ఎస్సీ కాలనీ, పాండురంగాపురం, అన్నపురెడ్డిపల్లిలో పెద్దిరెడ్డిగూడెం, పినపాక మండలం టి–కొత్తగూడెం గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరపాల్సి ఉంది. వీటితో పాటు పలు పంచాయతీల పరిధిలో 221 వార్డులు సైతం ఖాళీగానే ఉన్నాయి. వీటిలో ములకలపల్లి మండలంలో కొందరు వార్డు సభ్యులు ఎన్నికల సమయంలో లెక్కలు సరిగా చూపలేదంటూ ఈసీ వారిపై అనర్హత వేటు వేసింది. వాటికి కూడా తిరిగి ఉప ఎన్నికలు నిర్వహించే వీలుంది.

ఖాళీల వివరాలు నివేదించాం



జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల వివరాలను ఇటీవల మరోసారి సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాం. జిల్లాలో 18 ఎంపీటీసీలు, 18 సర్పంచ్‌లు, 221 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా ఈ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం.
– రమాకాంత్, డీపీఓ

రీజియన్‌కు నష్టాలు తగ్గాయి

ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత



మాట్లాడుతున్న ఆర్ఎం ఎస్తేర్ ప్రభులత

సత్తుపల్లిటౌన్: టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.111 కోట్ల నష్టం రాగా, గతేడాది 2022–23లో రూ.28 కోట్లకు తగ్గాయని రీజినల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత వెల్లడించారు. సత్తుపల్లిలో ఆర్టీసీ కండక్టర్లకు 'టాక్ట్' పేరిట ఇస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ ఆక్యుపెన్సీ రేషియో పెంచేలా కండక్టర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల ఆదరణపైనే సంస్థ మనుగడ ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఈ విషయమై వివిధ రంగాల నిపుణులతో ఇప్పిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభులత తెలిపారు. ఈసమావేశంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్యకు రెండు గరుడ వాహనాలు



గరుడ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం ఇత్తడి వాహనాలు బహూకరించారు. సుమారు రూ.2.90 లక్షల విలువైన రెండు గరుడ వాహనాలను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వాహనాలను స్వామివారి ఉత్సవ మూర్తుల వద్ద ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అధికారులు అందజేశారు.

కార్పొరేట్ సివిల్ జీఎంగా సూర్యనారాయణ



టి.సూర్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ సివిల్ జనరల్ మేనేజర్‌గా తిరుకోటి సూర్యనారాయణను నియమిస్తూ జీఎం ఈఈసెల్ కుమార్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యనారాయణ కొత్తగూడెం ఏరియాలో ఏజీఎం సివిల్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జీఎం సివిల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్‌బాబు ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో సూర్యనారాయణకు పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఈ మేరకు సూర్యనారాయణ జీఎం సివిల్‌గా మే 1వ తేదీ నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు నిధి ఆప్ కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) ఆధ్వర్యాన గురువారం వైరా, పాల్వంచల్లో నిధి కే ఆప్ నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. వైరాలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు పాల్వంచలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: ఆన్‌లైన్‌లో ఒకరి ఖాతా నుంచి నగదు అపహరించిన ఘటనపై బుధవారం పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన అన్వేశ్ ఆన్‌లైన్‌లో ఓ వస్తువు కొనుగోలు చేశాడు. కానీ, ఆ వస్తువు నచ్చకపోవడంతో రిటర్న్ పంపాడు. అందుకు సంబంధించిన నగదును తనఖాతాలో వేయాలని ఖాతా నంబర్‌ను పంపించాడు. ఇంతలోనే ఓ వ్యక్తి ఫోన్ చేసి, నగదు మీ ఖాతాకు బదలాయించాలంటే మెసేజ్‌లోని లింక్ నొక్కాలని సూచించాడు. అన్వేశ్ అది నమ్మి తనకు వచ్చిన మెసేజ్‌లోని లింక్‌ను నొక్కాడు. వెంటనే ఇతడి ఖాతాలో పడాల్సిన నగదు సదరు వ్యక్తి ఖాతాలోకి వెళ్లింది. తేరుకున్న అన్వేశ్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ మహిళను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఏలేటి పుల్లారావు కొంతకాలంగా వేధిస్తున్నాడు. సదరు వివాహిత లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌డీఎల్‌ఐఎస్ పైపులు చోరీ

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గుంపెన పంచాయతీలో ఆర్‌డీఎల్‌ఐఎస్ పైపులను గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంపెనలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న క్రమంలో 9 ఆర్‌డీఎల్‌ఐఎస్ (రాజీవ్ దుమ్ముగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) పనుల కోసం ఉపయోగించిన ఐరన్ పైపులు బయటపడ్డాయి. బయటపడిన పైపులను ఇరిగేషన్ అధికారులు అక్కడ యార్డ్‌లో భద్రపరిచారు. బుధవారం ఉదయం సైట్ ఇంజనీర్ ఒకరు పైపులను పరిశీలించగా 4 పైపులతోపాటు ఒక పైపు సగ భాగం మాత్రమే కనిపించాయి. పైపులు కనిపించక పోవడంతో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఇరిగేషన్ ఏఈ జి.మీనా ఘటనా స్థలాన్ని సందర్శించి పైపులు అపహరణకు గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన పైపుల విలువ సుమారు రూ.8,61,642 ఉంటుందని ఆమె తెలిపారు. ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

జేపీఎస్‌ల పోరుబాట

- రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్
- రేపటి నుంచి సమ్మె
- ఈ నెల 11తో నాలుగేళ్ల పదవీకాలం పూర్తి



అశ్వాపురం ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న జేపీఎస్‌లు (ఫైల్)

అశ్వాపురం: మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో ఉద్యోగంలోకి తీసుకున్న ప్రభుత్వం నాలుగేళ్లు గడుస్తున్నా రెగ్యులర్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పోరుబాట పట్టారు. ఈ నెల 12 నుంచి 15 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టిన వారు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా 370 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఏప్రిల్ 11, 2019న ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో నెలకు రూ.15 వేలు గౌరవ వేతనం ప్రకటించింది. మూడేళ్ల అనంతరం గ్రేడ్-4 ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నెల 11తో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కావడంతో తమను రెగ్యులర్ చేయాలని వారు పోరుబాట పట్టారు.

సమ్మెలోకి జేపీఎస్‌లు

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 12 నుంచి 15 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 15న ఎంపీడీఓలు, డీపీఓ, కలెక్టర్‌కు జేపీఎస్‌లు సమ్మె నోటీసులు అందజేశారు. 26న అఫీషియల్ గ్రూప్స్ (వాట్సాప్, టెలిగ్రామ్) నుంచి జేపీఎస్‌లు తప్పుకుంటారు. 27న జిల్లాలో ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరూ జిల్లా కేంద్రం చేరుకొని కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి 28 నుంచి సమ్మె గురించి వినతిపత్రం అందజేస్తారు. 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

జేపీఎస్‌ల సహాయ నిరాకరణ

- అఫీషియల్ వాట్సాప్ గ్రూపుల్లోంచి లెఫ్ట్

చుంచుపల్లి: పల్లె పాలనలో కీలకంగా వ్యవహరిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు దశల వారీ ఆందోళనల్లో భాగంగా బుధవారం ఏకంగా విధుల పట్ల సహాయ నిరాకరణకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28 నుంచి సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు తమ డిమాండ్లను వివరిస్తూ సమ్మె నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. వరస నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ అఫీషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి స్వచ్ఛందంగా బయటకు వచ్చారు. రాష్ట్ర కమిషనర్, జిల్లా కలెక్టర్, డీపీఓ, డీఆర్డీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలతో పాటు ఇతర ప్రభుత్వ అధికారుల అఫీషియల్ గ్రూపుల నుంచి జేపీఎస్‌లు బయటకు వచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టనున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం నుంచి జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు తమ విధులను బహిష్కరించి సమ్మెకు దిగేందుకు సన్నద్ధమయ్యారు.

తక్షణమే క్రమబద్ధీకరించాలి..



మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయితే రెగ్యులర్ చేస్తామన్న ప్రభుత్వం నాలుగేళ్లు గడిచినా క్రమబద్ధీకరించకపోవడంతో ఉద్యోగ భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలి. ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నాం.

–ఎస్‌కే తౌఫిక్‌పాషా, జేపీఎస్‌ల మండల అధ్యక్షుడు

పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర మాదే..



నాలుగేళ్లుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వం ఆదేశించిన మేరకు విధులు నిర్వర్తించాం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లె ప్రగతిలో పగలు, రాత్రి విధులు నిర్వర్తించి పల్లెప్రగతి విజయవంతంలో కీలకపాత్ర పోషించాం. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

–వేణుప్రియ, జేపీఎస్, సీతారాంపురం

రోజుకు 12 గంటలు పనిచేస్తున్నాం..



గ్రామ పంచాయతీల్లో 50 రకాల విధులు నిర్వర్తిస్తూ రోజుకు 10 నుంచి 12 గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నాం. పని ఒత్తిడి, ఇబ్బందులతో ఎంతో మంది ఉద్యోగాలు వదిలేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొందరు అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. మా సేవలు గుర్తించి, మమ్మల్ని క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

–డి.దినేశ్, జేపీఎస్, తుమ్మలచెరువు

ధాన్యం తనిఖీ కేంద్రం ఏర్పాటు



ధాన్యం తనిఖీ కేంద్రం వద్ద లారీలను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

భద్రాచలంటౌన్: తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి ధాన్యం ఇక్కడికి రాకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ధాన్యం తనిఖీ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేయడంతోపాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది సంయుక్తంగా తెలంగాణకు వచ్చే లోడ్ లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. అందుకోసం ఆయా శాఖల సిబ్బంది పగలు ముగ్గురు, రాత్రి ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయా రాష్ట్రాలలోని దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని తెలంగాణలో ఇక్కడి రైతుల ముసుగులో ఎక్కువ ధరకు విక్రయించేందుకు వస్తుండటంతో వారికి చెక్ పెట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో దళారులు సరిహద్దు రాష్ట్రాలలో ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడి రైతుల పేరుతో విక్రయించిన ఘటనలు ఉండటంతో అధికారులు చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

ఆర్టిజన్ల సమ్మె విరమణ

- తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని యాజమాన్యం హామీ

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌లు సమ్మె విరమించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం సమ్మెలోకి దిగగా.. విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు వివిధ రకాలుగా చేసిన కృషి ఫలించింది. సమ్మె ప్రారంభించిన 25వ తేదీన హాజరు కాని సుమారు 200 మంది ఆర్టిజన్ కార్మికులను విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలో పాల్వంచ కేటీపీఎస్‌లో పనిచేస్తున్న తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ జెన్‌కో అధ్యక్ష, కార్యదర్శులు ఉండేటి జయరాజు, ఆవుల కృష్ణారెడ్డి, సాంబశివరావు, ఖమ్మానికి చెందిన ట్రాన్స్‌కో కంపెనీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పురుషోత్తంరావులను విధుల నుంచి తొలగించారు. కాగా, బుధవారం హైదరాబాద్‌లోని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్(హెచ్82) నాయకులు చర్చలు జరిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనికి సీఎండీలు సానుకూలంగా స్పందించారు. తొలగించిన కార్మికులను పది రోజుల్లోగా విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తొలగింపు భయంతో..

రాష్ట్రంలోని సుమారు 23వేల మంది ఆర్టిజన్ కార్మికులు సరైన ఉద్యోగ భద్రత, వేతనాలు లేవని ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా జనరేషన్ స్టేషన్లు, జిల్లాల వారీగా సభలు ఏర్పాటు చేసి ఉద్యమానికి కార్యాచరణ రూపొందించారు. 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. కానీ చిన్న స్థాయి ఉద్యోగులు కావడంతో వారి ఉద్యమంపై అధికారులు ఉక్కుపాదం మోపారని, ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరింపులకు గురిచేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. తప్పని పరిస్థితుల్లో ఆర్టిజన్లు తిరిగి విధుల్లోకి వెళ్లారు.

ఏడాది గడిచినా హామీలు అమలుకావు..

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వరి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ముదిగొండ: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ అమలుచేయకుండా మోసం చేశారని.. ఇంకా ఏడాది గడిచినా ఆ హామీలు నెరవేరవని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ముదిగొండ మండలంలోని మేడేపల్లి, మాధాపురం, యడవల్లి, ముదిగొండల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బోనకల్ పర్యటనలో సీఎం కేసీఆర్ గంటల వ్యవధిలోనే రైతులకు నష్టపరిహారం అందజేస్తామని చెప్పి 47రోజులు గడిచినా అందలేదని పేర్కొన్నారు. ఈక్రమంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆతర్వాత అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను పరామర్శించిన ఆయన, ముదిగొండలోని తహసీల్ ఎదుట గ్రామదీపికలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వాగదాని కన్నయ్య, నాయకులు మోర్తాల నాగార్జునరెడ్డి, జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, అనంతరెడ్డి, రాఘవారెడ్డి, సోము అంకిరెడ్డి, కొండ రామారావు, వట్టికూటి సైదులుగౌడ్, కందుల రంగారావు, మరికంటి కృష్ణ, వెంకట్రావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉరేసుకుని ముగ్గురు ఆత్మహత్య

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ఉడతానిగుంపులో అద్దెకుంటున్న ఓ యువకుడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు.. అశ్వాపురం మండలం మంచికంటినగర్‌కు చెందిన కొప్పుకుల కార్తీక్ (26) కొంతకాలంగా మణుగూరు మండలంలోని ఉతనేనిగుంపులో అద్దెకుంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలి కాలంలో తనతో సహజీవనం చేస్తున్న యువతి ఫిర్యాదు చేయగా మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తీవ్ర మనస్తాపానికి గురైన కార్తీక్ అద్దెకుంటున్న ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ చెప్పారు. మృతుడి సోదరి శ్రీనవ్య ఫిర్యాదు మేరకు మణుగూరు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ వివరించారు.

అనారోగ్య కారణాలతో..

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామ పంచాయతీ పరిధి పంతులుతండాకు చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శివాజీగణేశ్ కథనం మేరకు.. పంతులుతండాకు చెందిన గుగులోత్ రమేశ్ (34) టీబీతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు రమేశ్‌ను పలుమార్లు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నప్పటికీ జబ్బు నయం కాకపోవడంతో మనోవేదనకు గురవుతున్నాడు. ఆరు నెలల కిందట భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. జబ్బు తగ్గకపోవడం, భార్య రాకపోవడంతో మంగళవారం సాయంత్రం చేనుకు వెళ్లివస్తాని చెప్పిన రమేశ్.. ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లేసరికి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి గుగులోత్ రుక్కి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శివాజీగణేశ్ చెప్పారు.

కుటుంబ కలహాలతో..

బూర్గంపాడు: మండలంలోని ఇరవెండి గ్రామానికి చెందిన వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇరవెండి గ్రామానికి చెందిన మహంకాళి దేవి (40) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను కుటుంబ సభ్యులు గమనించేసరికి మృతి చెందింది. కొంతకాలంగా భర్త రంగారావు, ఇతర కుటుంబసభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. దేవి ఆత్మహత్యపై ఆమె కుటుంబసభ్యులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

సుజాతనగర్: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ నల్లగోపు అనురాధ పనిప్రదేశంలో బుధవారం పాముకాటుకు గురైంది. స్థానిక హరిజనవాడ గ్రామ సమీపంలో కాల్వ పూడిక తీత పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో మట్టి తవ్వుతుండగా ఓ పాము అనురాధను కాటేసింది. గమనించిన సహచర కూలీలు పాము కరిచిన విషయాన్ని ఈజీఎస్ అధికారులకు తెలిపారు. వెంటనే వైద్యం నిమిత్తం ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న అనురాధను ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏపీఓ చందర్ పరామర్శించారు. కాగా కాటు వేసిన పాము విష పూరితమైనది కాదని ఉపాధి కూలీలు తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీపై విచారణ

- ఖమ్మంలో నిందితుడి అరెస్టుతో వెలుగులోకి వివరాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గుర్రాలకుంట గ్రామపంచాయతీ పరిధి టేకులతండాలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులపై ఖమ్మం పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. కొద్దిరోజుల క్రితం ఖమ్మంలో ఓ వ్యక్తిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరపగా పెద్దసంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. ఆతర్వాత వాహనాలను టేకులతండాలో అమ్మినట్లు చెప్పగా ఐదు రోజుల క్రితం ఖమ్మం పోలీసులు నిందితుడిని తండాకు తీసుకొచ్చి విచారణ జరిపారు. వాహనాలను కొనుగోలు చేసిన వారు స్వచ్ఛందంగా అప్పగించాలని తండావాసులకు సూచించారు. దీంతో బుధవారం నాలుగు వాహనాలను ప్రధాన రహదారి వద్ద వదిలి వెళ్లగా పోలీసులు స్వాధీనం చేసుకుని ఖమ్మం తరలించారు. కాగా, ఖమ్మం పోలీసులు స్వాధీనం చేసుకున్న నాలుగు స్ప్లెండర్ వాహనాలు ఏపీ రిజిస్ట్రేషన్‌తో ఉన్నాయి. నిందితుడి వద్ద పలువురు వాహనాలు కొనుగోలు చేసి నాటుసారా సరఫరా చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యాన పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరారు.

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు



మృతి చెందిన ఆనందరావు(ఫైల్)



ప్రమాదంలో పల్టీ కొట్టిన ట్రాక్టర్

పెనుబల్లి: గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడగా ఒకరు మృతి చెందడంతో పాటు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బయ్యన్నగూడెంకు చెందిన రైతు పామర్తి కృష్ణ తన పశువుల కోసం సత్తుపల్లి సమీపాన రామానగరం నుండి ట్రాక్టర్‌లో గడ్డి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో లంకపల్లి వద్ద లారీ వెనుక నుండి ట్రాక్టర్‌ను ఢీకొట్టిందద్ధీ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ పామర్తి కృష్ణతో పాటు ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన పామర్తి కృష్ణ, కూలీ కిన్నెర ఆనందరావు(45)ను ఖమ్మం తరలించారు. వీరిలో కిన్నెర ఆనందరావు ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. క్షతగాత్రులందరూ బయ్యన్నగూడెం పంచాయతీ పరిధిలోని నాయకులగూడెం వాసులని స్థానికులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం




ఘటనాస్థలిలో బోల్తా పడిన డీసీఎం

కూసుమంచి: సూర్యాపేట – ఖమ్మం జాతీయ రహదారిపై లోక్యాతండా వద్ద వెళ్తున్న లారీని వెనుక నుండి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణా జిల్లా నూజివీడు నుండి టమాటాల లోడ్‌తో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం.. ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం క్యాబిన్ నుజ్జునుజ్జయి బోల్తా పడగా టమాటాల బాక్స్‌లు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో డ్రైవర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా, క్యాబిన్‌లో ఉన్న డీసీఎం యజమాని కుమారుడు అభిషేక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో కూసుమంచి పోలీసులు, 108 సిబ్బంది చేరుకుని శంకర్, అభిషేక్‌ను క్యాబిన్ నుండి బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, డీసీఎం డ్రైవర్ శంకర్ నిర్లక్ష్యం, అతివేగంతోనే ఘటన జరిగిందని ఖమ్మంకు చెందిన కూరగాయల వ్యాపారి తోట రామారావు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

- తిరుమలలో దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..



రంగయ్య (ఫైల్)

చింతకాని: మండలంలోని జగన్నాథపురానికి చెందిన రేషన్ డీలర్ మండెపూడి రంగయ్య(75) బుధవారం ఉదయం గుండెపోటుతో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో మృతి చెందాడు. చింతకానికి చెందిన మిత్రుడు జాజాల చంద్రయ్యతో కలిసి రంగయ్య మంగళవారం ఉదయం తిరుపతి బయలుదేరిన ఆయన రాత్రి తిరుపతిలో దిగాక అర్ధరాత్రి 1.15 గంటలకు తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం చంద్రయ్య గది కోసం జీఎంసీ కౌంటర్ వద్దకు వెళ్లిన ఆయన రంగయ్యకు ఫోన్ చేసేసరికి అప్పటికే గుండెపోటుతో కుప్పకూలినట్లు పక్కనే ఉన్న భక్తులు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రయ్య చేరుకుని అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి రంగయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈవిషయాన్ని గ్రామంలోని కుటుంబీకులకు సమాచారం తెలపగా వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆయన మృతదేహం అర్ధరాత్రి స్వగ్రామానికి చేరే అవకాశముందని తెలిపారు. కాగా, రంగయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉండగా భార్య ఐదేళ్ల క్రితం, పెద్దకుమారుడు రెండేళ్ల క్రితం మృతి చెందారు.

ఐదెకరాల మొక్కజొన్న చేను దగ్ధం

బోనకల్: మండలంలోని చిరునోముల రెవెన్యూ పరిధిలో ఐదె ఎకరాల మొక్కజొన్న చేను బుధవారం దగ్ధమైంది. చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన రైతు కొనకంచి నాగరాజు పది ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాడు. చేను పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైరు తెగి పడడంతో మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకునేలోగా ఐదెకరాల్లో పంట దగ్ధమై రూ.2.50లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు వెల్లడించాడు.